రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:26 (ఆదివారం సాయంత్రం)
సహర్: 4:50 (సోమవారం ఉదయం)



గంజాయి రవాణాపై పటిష్ఠ నిఘా

సునీల్‌దత్, ఖమ్మం పోలీస్ కమిషనర్

ప్రశ్న: జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టడానికి పోలీస్ శాఖ నుంచి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: గంజాయి రవాణాను అరికట్టడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. అన్నిచోట్ల గస్తీ ఏర్పాటు చేశాం. గతం కంటే రవాణా తగ్గింది. గతంలో లారీలు, వ్యాన్లు, ట్రాక్టర్లలో తరలించే పరిస్థితి ఉండగా ఇప్పుడు ద్విచక్ర వాహనాలు, రైళ్లు, బస్సుల్లో కొద్దికొద్దిగా దొంగచాటుగా తరలిస్తున్నారు.

ప్ర: శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలు ఏమిటి?

జ: జిల్లాలో ప్రధానంగా రియల్‌ఎస్టేట్ వివాదాలు అధికంగా ఉన్నాయి. డబుల్ రిజిస్ట్రేషన్ చేసి ప్లాట్లు విక్రయించడం, తప్పుడు పత్రాలతో అమాయకులను మోసం చేయడం కనిపిస్తోంది. కొందరు ఉద్యోగులు, అధికారులు కూడా రియల్‌ఎస్టేట్ చేస్తూ దందాలకు పాల్పడుతున్నారు. ఫిర్యాదులు రాగానే విచారించి కేసులు నమోదుచేసి అరెస్టు చేస్తున్నాం. కొంతమంది ప్రభుత్వ భూములు, ప్రైవేటు ప్లాట్లను కూడా ఆక్రమిస్తున్నారు. వారిపై కూడా కేసులు నమోదుచేసి అరెస్టుచేస్తున్నాం.

ప్ర: సీసీ కెమెరాలు చాలా చోట్ల పనిచేయడం లేదని తెలిసింది. వీటి మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఎక్కువసంఖ్యలో ఉన్నాయి. గతంలో పలు విధాలుగా వచ్చిన ప్రభుత్వ గ్రాంట్లతో కెమెరాలు ఏర్పాటు చేశాం. వీటి నిర్వహకు పోలీసుశాఖ వద్ద నిధులు లేవు. సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యతను ఖమ్మం కార్పొరేషన్‌కు అప్పగిస్తున్నాం. ఈమేరకు లేఖ రాశాం. శాంతిభద్రతల పర్యవేక్షణలో సీసీ కెమెరాలు కీలకంగా ఉన్నాయి.

ప్ర: ఇసుక, బియ్యం అక్రమ రవాణా మీ దృష్టిలో ఉన్నాయా?

జ: ఆంధ్రప్రదేశ్ నుంచి సరిహద్దు గ్రామాల్లో దొంగచాటుగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదుచేస్తున్నాం. రేషన్‌బియ్యం అక్రమ రవాణా విషయంలో కూడా కఠిన చర్యలు తీసుకుంటున్నాం. సూర్యాపేట, జగ్గయ్యపేట, మహబూబాబాద్ ప్రాంతాలనుంచి ఖమ్మం మీదుగా రేషన్‌బియ్యం రవాణాను అన్ని విధాలా నియంత్రిస్తున్నాం. ఇటీవల అనేక లారీలు పట్టుకుని సీజ్‌చేశాం. ప్రధాన సూత్రధారులపై కేసులు నమోదు చేశాం.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

సీతారాముల కల్యాణానికి రారండి

- మంత్రులకు ఆహ్వాన పత్రికలు అందజేసిన ఆలయ అధికారులు
- హైదరాబాద్ తరలివెళ్లిన వైదిక బృందం

వివరాలు : 6లో



ఖమ్మం యూపీహెచ్ కాలనీలోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రం

ఆటపాటలతో అభ్యసన..

- యూపీహెచ్ కాలనీలో ఆకట్టుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రం
- ఉన్నతాధికారుల ప్రత్యేక శ్రద్ధతో మోడల్‌గా రూపు

బహుళ అంతస్థుల భవనాల్లో ఏర్పాటు చేసిన లిఫ్టులు (ఎలివేటర్లు) ప్రాణాంతకంగా మారుతున్నాయా..? వాటి నిర్వహణపై నిర్లక్ష్యం వహించడం వల్ల అమాయకులు బలవుతున్నారా..? కాసులకు కక్కుర్తిపడి బిల్డర్లు నాసిరకం లిఫ్టులను ఏర్పాటుచేయడమే ఇందుకు కారణమా..? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఖమ్మం నగరంలో ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. తాజాగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో లిఫ్ట్ అదుపుతప్పి కిందపడటంతో ఓ మహిళారోగి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. 2022 సెప్టెంబరులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బంధువును పరామర్శించేందుకు వచ్చిన వైరా మండలం గొల్లెనపాడుకు చెందిన ఓ మహిళ ఆసుపత్రిలో పై అంతస్థు నుంచి కిందకు వెళ్లడానికి లిఫ్టు బటన్ నొక్కగా.. లిఫ్ట్ రాకముందే డోర్లు తెరుచుకోవడంతో లోపలికి అడుగుపెట్టి లిఫ్ట్ గుంతలో పడి మృతి చెందింది. కొద్దిరోజుల క్రితం ఖమ్మంలోని ఓ కమర్షియల్ కాంప్లెక్స్‌లో లిఫ్ట్ స్ట్రక్ అవ్వడంతో ఇద్దరు వ్యక్తులు అందులో చిక్కుకుపోయి నరకం అనుభవించారు. ఈ ప్రమాదాలకు లిఫ్టల ఏర్పాటు సమయంలో ప్రమాణాలు పాటించకపోవడంతో పాటు, నిర్వహణ లోపాలు, అధికారుల పర్యవేక్షణ లేమి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

- ఆస్పత్రులు, కమర్షియల్ భవనాల్లో లిఫ్టల నిర్వహణలో తీవ్ర లోపాలు
- వందలాది అపార్ట్‌మెంట్లలోనూ నాణ్యతలేని లిఫ్టులే
- నిరంతర పర్యవేక్షణ కరువు
- బలైపోతున్న అమాయకులు
- తాజాగా ప్రైవేటు ఆస్పత్రిలో మహిళారోగి మృతి
- లిఫ్టల పర్యవేక్షణ ఏ శాఖ పరిధిలోకి వస్తుందో తెలియక అయోమయం



ప్రజలు పాటించాల్సినవి ఇవే..

అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ వినియోగించే సమయంలో ప్రజలు కొంతమేర జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చు. లిఫ్ట్‌ను ఓవర్ లోడ్ కాకుండా చూసుకోవాలి. ఓవర్‌లోడ్ కారణంగా భద్రతా లోపాలు తలెత్తే అవకాశం ఉంది. లిఫ్ట్ ఎక్కే సమయంలో సంయమనం పాటించాలి. లిఫ్ట్ ఎక్కిన తర్వాత అందులో ఏమైనా అనుమానస్పద శబ్దాలు కదలికలు వస్తే వెంటనే సబంధిత నిర్వాహకులకు తెలియచేయాలి. పొరపాటున లిఫ్ట్‌లో చిక్కుకుంటే అత్యవసర బటన్ నొక్కడం, అత్యవసర ఫోన్‌ను ఉపయోగించాలి. లిఫ్ట్‌ను ఉపయోగించే టప్పుడు పిల్లలని గమనిస్తూ ఉండాలి. లిఫ్ట్ డోర్లను బలవంతంగా తెరవకూడదు.

బాబోయ్ లిఫ్ట్‌లు..

ప్రమాణాలు లేక తరుచూ ప్రమాదాలు

ఖమ్మం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ఆస్పత్రులు, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో లిఫ్ట్ ప్రమాదాలకు ప్రమాణాలు పాటించకపోవడంతో పాటు నిర్వహణ లోపాలే కారణంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఆయా లిఫ్టులు ఏర్పాటు చేసే సమయంలో సరైన ప్రమాణాలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడైనా లిఫ్ట్ ఏర్పాటు చేయాలంటే బీఐఎస్ నిబంధనలు పాటించాలి. లిఫ్ట్ నిర్మించే సమయంలో అందులో ఎంతమంది ప్రయాణించాలి, ఎంత బరువు మోస్తుందనే విషయాలతో పాటు స్పేర్‌పార్ట్స్ నాణ్యతతోపాటు, విద్యుత్ సరఫరా, సెన్సార్, లిఫ్ట్ వేగం సెకనుకు 0.2 మీటర్లకు మించకుండా ఉండటం వంటి ప్రమాణాలు తప్పనిసరి. సాధారణంగా 20 ఏళ్లకు మించిన లిఫ్టలను ఖచ్చితంగా మార్చాల్సి ఉంటుంది. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాత్రం అలాంటివేమీ పట్టించుకునే పరిస్థితులు లేవు.

ఖమ్మం నగరంతోపాటు, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర, భద్రాచలం, మణుగూరు వంటి పలు పట్టణ ప్రాంతాల్లో వందల కొద్దీ అపార్ట్‌మెంట్లు ఉండగా.. ఆయా అపార్ట్‌మెంట్లతో పాటు, షాపింగ్‌మాల్స్, ఆసుపత్రులు, కమర్షియల్ బిల్డింగ్‌లలో ఇష్టారాజ్యంగా లిఫ్టుల నిర్మాణం చేస్తున్నారు. చాలావరకు అపార్ట్‌మెంట్లు నిర్మాణం చేసే సమయంలో తక్కువ వ్యయంలో నిర్మాణం పూర్తవాలన్న ఉద్దేశంతో కొందరు బిల్డర్లు నాణ్యత లేని లిఫ్ట్‌లను ఏర్పాటు చేస్తుంటారు. ప్రస్తుతం వందలకొద్ది లిఫ్టలలో స్విచ్‌లు సరిగ్గా పని చేయడం లేదు. మరికొన్నిచోట్ల సెన్సార్‌లు పనిచేయక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక ఎమర్జెన్సీ బటన్, అలారం వంటివి ఉంటాయన్న అవగాహన చాలామందికి తెలియకపోవడం, ఒకవేళ తెలిసినా ఆయా బటన్స్ పనిచేయక ఇబ్బందులు పడటం సర్వసాధారణంగా మారింది. లిఫ్టలను సాంకేతిక నిపుణులతో తరచూ భద్రతా ఆడిట్‌లు నిర్వహించడం ద్వారా ప్రమాదాలు నివారించొచ్చు. కానీ లిఫ్టలు ఏర్పాటు చేసిన సమయంలో మినహా ఆ తర్వాత వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

పర్యవేక్షణ లోపం....

లిఫ్టులపై ఎవరికీ పూర్తిస్థాయి పర్యవేక్షణ అధికారాలు లేకపోవడం కారణంగా ఇష్టారాజ్యంగా లిఫ్టల నిర్మాణాలు జరుగుతున్నాయి. వాస్తవానికి ఒక బిల్డింగ్ 13 మీటర్ల కన్నా ఎక్కువ ఎత్తు ఉంటే లిఫ్ట్ ఉండాలి. ఇళ్లల్లో వినియోగించే లిఫ్ట్ అయితే దాని సామర్థ్యం 204 కేజీల కన్నా తక్కువ 272కేజీల కన్నా ఎక్కువ ఉండకూడదని నిబంధనలు చెబుతున్నాయి. వాస్తవానికి అపార్ట్‌మెంట్, (మిగతా 6వ పేజీలో)

రేపే ఆంధ్రజ్యోతి

లక్కీడ్రా

22వ వార్షికోత్సవ వేళ పాఠకులకు బహుమతులు

ఖమ్మం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'మా అక్షరం మీ ఆయుధం' అనే నినాదంతో 2002లో పునఃప్రారంభమై తెలుగునేలపై తనదైన స్థానాన్ని పదిలపరుచుకొని ప్రజాదరణతో 'ఆంధ్రజ్యోతి' ముందుకు దూసుకెళ్తోంది. సామాజిక బాధ్యతతో సాగుతున్న అక్షర ప్రయాణంలో 22 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో పాఠకులకు వార్షికోత్సవ బహుమతులు అందించేందుకు లక్కీ డ్రా కార్యక్రమం సోమవారం జరగనుంది. ఖమ్మంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో గల ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు లక్కీడ్రా నిర్వహిస్తున్నారు. యూనిట్ స్థాయిలో మొదటి బహుమతి కింద మోటారుబైక్, రెండో బహుమతి కింద రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి కింద టీవీ ఇవ్వనున్నారు. అశేష పాఠకుల నుంచి వచ్చిన కూపన్ల నుంచి డ్రా తీసి విజేతలను ఎంపిక చేయనున్నారు. వీటితోపాటు పలువురికి కన్సోలేషన్ బహుమతులు కూడా అందించనున్నారు. ఇప్పటికే వేలాదిమంది పాఠకులు ఆంధ్రజ్యోతి కూపన్లను ఖమ్మం యూనిట్ కార్యాలయానికి పంపించారు.



7

వైద్య విద్యలో నేహాశివాని ప్రతిభ

- అమెరికన్ యూనివర్సిటీలో జనరల్ మెడిసిన్‌లో పీజీ సీటు
- మొదటి ప్రయత్నంలోనే విజయం

జమలాపురంలో 4న శ్రీవారి కల్యాణం

- శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7 వరకు నిర్వహణ
- ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా వేడుకల ప్రారంభం
- ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు వెల్లడి

ఎర్రుపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. ఆలయ ధార్మిక భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30నుండి ఏప్రిల్ 7వరకు శ్రీవిశ్వావసు నామ సంవత్సర శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 30న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దంపతులు బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు.

31న ధ్వజారోహణం తర్వాత ఏప్రిల్ 4న వకుళామాత స్టేడియంలో శ్రీవారి కల్యాణం జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం గ్రామ సేవ అనంతరం గ్రామతటాకంలో తెప్పోత్సవం న్విహిస్తామన్నారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం, 7న మహాపూర్ణాహుతి చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీవారి నిత్యం కల్యాణం రద్దుచేశామని, సుప్రభాత సేవ ప్రాతఃకాలార్చన, సర్వదర్శనం, ఆర్జిత సేవలు, గోపూజ వంటి నిత్య పూజలు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలు, బుక్‌లెట్లను ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తితో కలిసి ఈవో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

పట్టు రైతుల విజ్ఞాన యాత్ర

- రంగారెడ్డి జిల్లాలో మల్బరీ తోటల పరిశీలన
- మెళకువలను వివరించిన శాస్త్రవేత్తలు



విజ్ఞాన యాత్రకు వెళ్లిన పట్టు రైతులు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రైతులు సంప్రదాయ పంటలతో నష్టపోకుండా పట్టు పరిశ్రమ చేపట్టి నెలవారీ ఆదాయాన్ని పొంది అభివృద్ధి పథం వైపు సాగలని పట్టు పరిశ్రమ జిల్లా ఉప సంచాలకుడు ముత్యాలు తెలిపినారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 50 మంది రైతులు విజ్ఞానయాత్రగా రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం కోరింటకుంట గ్రామంలోని మల్బరి తోటలను, పట్టు పురుగుల పెంపకము, రేరింగ్ షెడ్డులను పరిశీలించారు. శాస్త్రవేత్తలు వినోద్ కుమార్, రాఘవేంద్ర పట్టు గూళ్లు తీసే విధానంలో మెళకువలను, నాణ్యత ప్రమాణాలను రైతులకు వివరించారు. ఈ విజ్ఞాన యాత్రలో సహాయ పట్టు పరిశ్రమ అధికారి దేవ రాజు , రైతులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం పాట

దుమ్ముగూడెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం శ్రీ ఆత్మా రామచంద్రస్వామి వారి ఆలయ భూముల కౌలు వేలం పాటలు శనివారం ఆలయ ప్రాంగణంలో జరిగాయి. నడికుడి భూమిని ఆదివాసీ జగిడి అర్జున్ రూ2.87లక్షలకుగానూ, చిన నల్లబల్లి భూమిని మర్మం ప్రసాద్ రూ.6వేలకు పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈవో సుదర్శన్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరావు, సిబ్బంది కృష్ణమోహన్ గ్రామస్థులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి రారండి..

భద్రాచలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర దేవాదాయ శాఖ, భద్రాద్రి దేవస్థానం అధికారులు అందజేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక సిబ్బంది మర్యాదపూర్వకంగా మంత్రులను కలిసి శాలువ, వేద ఆశీర్వచనం, ప్రసాదాన్ని అందజేశారు.

అనంతరం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేశారు. అలాగే ఎంపీ పోరిక బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులకు సైతం ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో శ్రవణ్‌కుమార్, సీసీ శ్రీనివాసరెడ్డి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకుడు అమరవాది గోపాల కృష్ణమాచార్యులు, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, అర్చకులు అమరవాది కృష్ణమాచార్య శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాబోయ్ లిఫ్టులు..

(5వ పేజీ తరువాయి)

ఇతర కాంప్లెక్స్‌ల నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడానికి పురపాలకశాఖ అమలు చేసే జీవో 168లో లిఫ్ట ఏర్పాటు గురించి వివరించినా అందులో నాణ్యత, నిర్వాహణ, నియంత్రణ వంటి వివరాలు లేవని కొందరు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం లిఫ్ట్ ఏర్పాటు అంశాలను పరిశీలించాలని అధికారులు భావించినా మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లో వందల కొద్దీ అపార్ట్‌మెంట్లకు అసలు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లే తీసుకోవడం లేదు. లిఫ్ట్ ఏర్పాటు చేసిన తర్వాత విద్యుత్‌శాఖ వారు నిరభ్యంతర పత్రం జారీ చేయాల్సి ఉన్నా చట్టం లేకపోవడంతో దాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజలు కూడా లిఫ్టల నిర్వహణను పట్టించుకోకపోవడంతో నిరంతరం ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు పాటిస్తేనే ఓసీ

వసుంధర, ఏసీపీ టౌన్‌ప్లానింగ్

అపార్ట్‌మెంట్లకు సంబంధించి అప్రూవల్ ఇవ్వాలంటే దరఖాస్తుదారులు సమర్పించే ప్లానింగ్‌లో ఎలాంటి తప్పులు లేకుండా ఉండాలి. ప్లానింగ్‌లో పొందుపర్చినట్టుగా లిఫ్ట్ సౌకర్యం ఉన్నవాటికే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఇస్తారు.

మా పరిధిలో లేదు...

రామారావు, డీఈ ఆపరేషన్స్, ఖమ్మం

లిఫ్ట్‌కు సంబంధించిన అనుమతులు మా పరిధిలో లేవు. పెద్ద అపార్ట్‌మెంట్లు నిర్మించినప్పుడు చీఫ్ ఎలక్ట్రికల్ అధికారులు పరిశీలించి సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత మాత్రమే దానికి తగిన లోడుతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు.



బోటింగ్ కోసం సిద్ధం చేసిన నీటి కొలను



మ్యూజియం ముందు గిరిజన సంప్రదాయ గృహాలు



ఆకట్టుకునే పెయింటింగ్స్

గిరి 'జయహో...'

- గిరిజన మ్యూజియానికి అదనపు హంగులు
- ఏజెన్సీ గ్రామాలు, పంటల సాగు నమూనాలు
- అందుబాటులో ఆర్చరీ, సాండ్‌వాలీబాల్, షటిల్ కోర్టు
- చిన్నారులకు బోటింగ్, ప్రత్యేక పార్క్ బాక్స్ క్రికెట్

భద్రాచలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న గిరిజన మ్యూజియాన్ని తిలకించేందుకు తరలివచ్చే పర్యాటకులు, ఔత్సాహికులకు పూర్తిస్థాయిలో విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ప్రత్యేక చొరవతో ఇందుకు సంబంధించి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఐటీడీఏలోని వివిధ విభాగాల అధికారులతో కమిటీని సైతం ఏర్పాటు చేసి పనుల తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా పీవో రాహుల్ తరచూ మ్యూజియంను సందర్శించి అధికారులకు చేపట్టాల్సిన చేర్పులు, మార్పులపై సూచనలు అందజేస్తున్నారు.

ఈ క్రమంలో ఇప్పటికే ఉన్న మ్యూజియానికి అదనపు హంగులను సమకూర్చడంతో సరికొత్త రూపును గిరిజన మ్యూజియం సంతరించుకుంది. ఈ మ్యూజియంలో జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న కోయ, కొండరెడ్డి, బంజార, నాయకపోడు తదితర గిరిజనుల జీవనశైలిని ప్రతిబింబించే అంశాలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. అయితే వీటికి అదనంగా నగరాలు,



చిన్నారుల కోసం ప్రత్యేక పార్కు

పట్టణాల నుంచి వచ్చే వివిధ రంగాలు, వృత్తుల వారు గిరిజన జీవన శైలిని తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఒక గదిలో ఏజెన్సీ గ్రామాలు, గిరిజనుల సాగు చేసే విధానం తదితర అంశాలు సులభంగా అర్థమయ్యే రీతిలో గోడలపై చిత్రీకరించారు. నేలపై భాగంలో మట్టిని వేసి సంబంధిత చిత్రాలకు సంబంధించిన నమూనాలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అంతా అనుకూలిస్తే ఏప్రిల్‌లో శ్రీరామనవమిని పురస్కరించుకొని దీన్ని ప్రారంభించేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. మ్యూజియానికి అదనపు హంగులు సమకూర్చిన క్రమంలోనిర్వహణ స్థాయి తగ్గకుండా ఉండేందుకు నామమాత్రపు టికెట్ ధరను పెట్టేందుకు అధికారులు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారికంగా ఇంకా ఖరారు కాలేదు.

విజ్ఞానం...వినోదం

గిరిజన మ్యూజియాన్ని సందర్శించే పర్యాటకులు, ఔత్సాహికులకు కేవలం వారి పర్యటన విజ్ఞానానికే పరిమితం కాకుండా వినోదం, ఆనందం, ఆహ్లాదాన్ని పంచే రీతిలో గిరిజన మ్యూజియంలో సరికొత్త మార్పులు చేర్పులు చేశారు. మ్యూజియంలో ఏజెన్సీలో గిరిజనులు వినియోగించే పనిముట్లు, పాత్రలు వేషధారణ, వివిధ రకాల వాయిద్యాలు, విల్లు, బాణాలు, గజ్జెలు, వడ్లగుమ్మి(ధాన్యాగారం), వెదురు అల్లికలు, చెక్కబొమ్మలు, గిరిజన జీవన బతుకు చిత్రాలను ఏర్పాటు చేశారు. అయితే వీటితోనే వీటిని చూడటంతోనే పర్యాటకులకు పరిమితం చేయకుండా ఏజెన్సీలో గిరిజనుల నివాస నమూనాలు, ఆర్చరీ, సాండ్ వాలీబాల్, షటిల్‌కోర్టు రూపొందించారు. చిన్నారులకు బోటింగ్ కోసం ప్రత్యేకంగా కొలను సైతం ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఇప్పటికే నాలుగు బోటింగ్ సామగ్రి సైతం తీసుకొచ్చారు. ప్రత్యేక పార్కులో చిన్నారుల కోసం ఊయల, జారుడుబండ ఇతర ఆటలకు సంబంధించిన వస్తువులను ఏర్పాటు చేశారు.

రయ్.. రయ్.. రోయింగ్

- తుమ్మల చెరువులో వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ

అశ్వాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో సుప్రసిద్ధ సాగునీటి వనరుగా పేరొందిన తుమ్మలచెరువులో యువతకు రోయింగ్ వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణను అధికారులు ప్రారంభించారు. శనివారం నుంచి ఈనెల 26వరకు శిక్షణా కార్యక్రమం జరుగనుంది. దీంతో వీకెండ్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన యువత శిక్షణకు జోష్‌తో హాజరవుతుండటంతో తుమ్మలచెరువు వద్ద సందడి నెలకొంది. యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రోయింగ్ క్రీడాకారుడు యలమంచిలి కిరణ్ నేతృత్వంలో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక చొరవతో తుమ్మలచెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఈఏడాది జనవరిలో చెరువులో బోటింగ్‌ను ప్రారంభించారు. నిర్వహణను డ్వాక్రా మహిళలకు అప్పగించటంతో బోటింగ్ విజయవంతంగా కొనసాగుతోంది. రోయింగ్‌వాటర్ స్పోర్ట్స్‌లో కూడా శిక్షణ ఇస్తుండటంతో దీనిని యువత సద్వినియోగపర్చుకుని రోయింగ్ కోటాలో ఉద్యోగావకాశాల్లో లబ్ధిపొందాలని పలువురు కోరుతున్నారు.



తుమ్మల చెరువులో రోయింగ్ శిక్షణ ఇస్తున్న దృశ్యం

విద్యార్థులు పరిశోధనపై దృష్టి సారించాలి

- సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ హరిశంకర్
- కేఎల్ఆర్ ఫార్మసీలో రెండు రోజుల వర్క్‌షాప్

పాల్వంచ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనా మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించి వినూత్నమైన ఆవిష్కరణ మార్గాలకు అంకురార్పణ చేయాలని ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ మాజీ డిప్యూటీ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్. హరిశంకర్ అన్నారు. కేఎల్ఆర్ ఫార్మసీ కళాశాలలో జాతీయస్థాయి ఫార్మకాలజీ పరిశోధన అనే అంశంపై రెండు రోజులుగా కొనసాగుతున్న వర్క్‌షాపు ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధనలో ప్రయోగ మోడల్స్ తక్కువ ఖర్చులో ఎక్కువ నైపుణ్యత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కేయూ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఎంజే మహేష్‌కుమార్, ఛైర్‌పర్సన్ నగమణి, డైరెక్టర్ మురళీప్రసాద్, సిద్ధార్థ రెడ్డి, కన్వీనర్ అఖిల, ప్రిన్సిపాల్ ఎం. పురుషోత్తమన్ పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ నరసింహారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

తహసీల్దార్‌ను అంటూ..

బ్యాంకును బురిడీ కొట్టించేందుకు యత్నం

కలెక్టర్ సంతకం ఫోర్జరీ, స్టాంపు ముద్రణ

హైదరాబాద్ ఎస్‌బీఐలో వ్యక్తిగత రుణంకోసం దరఖాస్తు

కూసుమంచి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తాను కూసుమంచి తహసీల్దార్‌నని, తనకు వ్యక్తిగత రుణం మంజూరు చేయాలని కోరుతూ సాక్షాత్తు ఎస్‌బీఐ అధికారులనే బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయాడు ఓ ఘరానా మోసగాడు. హైదరాబాద్‌లో వ్యక్తిగత లోను కోసం దరఖాస్తు చేసుకోగా కూసుమంచిలో బయటపడింది. బ్యాంకు అధికారుల కథనం ప్రకారం.. జంగం బాలరాజు అనే వ్యక్తి తాను కూసుమంచి తహసీల్దార్‌నని పేర్కొంటూ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ పేరిట తప్పుడు గుర్తింపుకార్డు సృష్టించుకున్నాడు. దానిపై ఏకంగా కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి స్టాంపు కూడా ముద్రించుకున్నాడు. తండ్రి చంద్రమౌళి అని, తహసీల్దార్, కూసుమంచి పేరిట ఐడీ కార్డు తయారు చేసుకున్నాడు. తాను తయారు చేసుకున్న వివరాలతో హైదరాబాద్‌లోని జూబ్లీపుర ఎస్‌బీఐ అధికారులకు తన వ్యక్తితో పంపించాడు.

మాసారు కూసుమంచి తహసీల్దార్‌గా పనిచేస్తున్నారని అక్కడే ఉంటున్నారని, అక్కడే నివాసం ఉంటున్నారని వ్యక్తి గత రుణం మంజూరు కోసం దరఖాస్తు పంపించారని చెప్పి ఇచ్చిపోయారని తెలిపారు. జూబ్లీపుర ఎస్‌బీఐ అధికారులు దరఖాస్తు పరిశీలనకు కూసుమంచి బ్రాంచ్‌కు విచారణ నిమిత్తం పంచించారు.



రుణం కోసం తయారు చేసిన ఐడీ కార్డు

దీంతో కూసుమంచి ఎస్‌బీఐ మేనేజరు వెంటనే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేశారు. కూసుమంచి తహసీల్దార్ కరుణశ్రీ అని నిర్ధారించుకుని, జంగం బాలరాజు పేరిట ఎవరూ లేరని, పనిచేయలేదని నిర్ధారించుకుని, జూబ్లీపూర బ్యాంకు అధికారులకు వివరాలు అందజేశారు.

ఈ విషయంపై జూబ్లీపుర అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కరుణశ్రీని వివరణ కోరగా కూసుమంచిలో బాలరాజు పేరిట ఎవరూ పనిచేయలేదని, బ్యాంకు అధికారులను మోసం చేసి రుణం పొందేందుకు ఈ ప్రయత్నం చేసి ఉంటారని తెలిపారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయండి

అసెంబ్లీలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



కొత్తగూడెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కిన్నెరసాని నుంచి భద్రాచలం వయా మీదుగా పర్ణశాల వరకు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధిపర్చాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పాల్వంచ ప్రాంతంలోని కిన్నెరసాని ప్రాజెక్టు, కిన్నెరసాని పరివాహక ప్రాంత అందాలను కవి విశ్వనాథ సత్యనారాయణ ఎంతగానో వర్ణించి కవిత్వం రాశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. గత ఏడాదిలో కిన్నెరసాని ప్రాజెక్టులో రాష్ట్ర పర్యాటకశాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒక రోజుపాటు బోటు షికారు చేసి కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని ఆశీర్వదించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కిన్నెరసాని ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికే ఫారెస్ట్ శాఖాధికారులు, కిన్నెరసాని అటవీ ప్రాంతంలో జూపార్కును ఏర్పాటు చేస్తామని ప్రకటించారని ఆ ప్రాంతంలో జూపార్కును యుద్ధ ప్రాతిపదికను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. కిన్నెరసాని ప్రాజెక్టును సందర్శించేందుకు వందలాది మంది పర్యాటకులు వస్తున్నారని వేసవికాలంలో బోటు షికారు అత్యధికంగా చేస్తారని ఆ ప్రాంతంలో వేసవిలో పర్యాటక అతిథులకు అతిథిగృహాలను కూడ నిర్మించారని గుర్తు చేశారు. కిన్నెరసాని ప్రాంతం నుంచి భద్రాచలం రామాలయం నుంచి పర్ణశాల వరకు పర్యాటకంగా మరింతగా అభవృద్ధి పరిస్తే ఎంతో ఆదాయం సమకూరుతుందన్నారు. భద్రాద్రి పుణ్యక్షేత్రం కూడ ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. కిన్నెరసాని, భద్రాచలం, పర్ణశాల, మణుగూరు ప్రాంతంలో జలపాతం ఉందని ఆ ప్రాంతాలన్నింటినీ కూడా లింకప్ చేస్తూ ఒక సఫారీగా చేసి ప్రభుత్వం పర్యాటక రంగంగా తీర్చిదిద్దితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యాటకంగా కూడ మంచి అభివృద్ధి పాధిస్తుందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని నిధులు కేటాయించి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీ స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'పులుసు బొంత'కు నిధులు మంజూరు చేయాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



కరకగూడెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పులుసు బొంత నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఈ విషయాన్ని ఎమ్మెల్యే అసెంబ్లీలో లేవనెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల ఏజెన్సీ మండలం అయినా కరకగూడెం మండలంలో రైతులు సాగు చేసుకుంటున్న పంటలకు సాగునీరు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని.. పులుసు బొంత నిర్మాణం పూర్తయితే కరకగూడెం మండలంతో పాటు పినపాక మండలంలోని సుమారు వందల ఎకరాలకు సాగునీరు అందుతాయని, రైతులు రెండు పంటలు సాగుచేసుకుంటారని వివరించారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే పులుసుబొంత ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయమై ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం కోరారు.

వైరాలో పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



వైరా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన నియోజకవర్గ కేంద్రమైన వైరా రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కోరారు. శనివారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో రాందాస్‌నాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో రూ.21వేల కోట్ల రుణమాఫీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైరాలో జరిగిన రైతు సదస్సులో ప్రకటించారని గుర్తుచేశారు. వైరా నుంచి రుణమాఫీని పూర్తిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఇదే సమయంలో ఖమ్మంజిల్లాకు నడిబొడ్డున ఖమ్మం-రాజమండ్రి, ఖమ్మం-భద్రాచలం వెళ్లే జాతీయ ప్రధాన రహదారి పక్కనే వైరా రిజర్వాయర్ ఉందని తెలిపారు. దీన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. హరిత రెస్టారెంట్ అలాగే స్విమ్మింగ్‌పూల్స్ వైరా నుంచి తల్లాడ వెళ్లే లింక్ రోడ్డుకు నూతన రోడ్డు నిర్మాణం చేయాలని, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వైరా రిజర్వాయర్‌ను సందర్శించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు.

ఆటపాటలతో అభ్యసన

- ప్రైవేటు ప్లేస్కూల్స్‌కు తీసిపోని విధంగా ఏర్పాట్లు
- ఆకర్షణీయ హంగులతో ఉత్సాహంగా వస్తున్న పిల్లలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ఖమ్మం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సాధారణంగా అంగన్‌వాడీ కేంద్రాలంటే పిల్లలను పంపలేని పరిస్థితి ఉంటుందని అందరూ భావిస్తారు. కనీసం పది మంది పిల్లలుండాలని నిబంధన ఉన్నా అసౌకర్యాల మూలంగా కేవలం ముగ్గురు, నలుగురికి పరిమితమై ఉంటాయి. ఒకరకంగా ఇవి గుడ్లు, భోజనం పెట్టే కేంద్రాలుగా పేరుపొందాయి. అయితే ఇందుకు భిన్నంగా ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియాలోని యూపీహెచ్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రం అందరినీ ఆకర్షిస్తోంది. ఈ కేంద్రాన్ని అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ ప్లేస్కూల్ వలే ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సకల సౌకర్యాలను కల్పించడంతో పాటు, పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపేలా తీర్చిదిద్దారు. ఆటపాటల కోసం సదుపాయాలు ఏర్పాటుచేశారు. ఈ కేంద్రం ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోనే మోడల్ కేంద్రంగా వెలుగొందుతోంది. ఈ కేంద్రాన్ని ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రారంభించారు. రూ.7లక్షల ఖమ్మం కార్పొరేషన్ నిధులతో ప్రైవేటు ప్లేస్కూల్స్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తీర్చిదిద్దారు. ఈ ప్రాంతంలో ఉన్న రెండు అంగన్‌వాడీ సెంటర్లను కలిపి మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దారు. ట్రైనీ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ ఆలోచనలతో ఈ మోడల్ కేంద్రం ప్రతిపాదించారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయడంతో మోడల్ అంగన్‌వాడీకేంద్రం రూపుదిద్దుకుంది.

రంగు రంగుల చిత్రాలు..

అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని రంగులతో డిజైన్ చేశారు. పిల్లల్లో సృజనాత్మకత పెంచేందుకు జంతువులు, పక్షులతోపాటు జంగిల్ బుక్ వంటి దృశ్యాలను, పిల్లలను ఆకర్షించేలా పలురకాల చిత్రాలను గోడలపై చిత్రించారు. చెట్లు, పూలు, కూరగాయలు, వాహనాలు, అంతరిక్ష వోమగాములతోపాటు పలురకాల పక్షులు, ప్రాజెక్టులు ఇలా పిల్లల్లో సృజనాత్మకత పెంచే అన్ని అంశాలను చిత్రీకరించారు. ఇంగ్లీష్ నెలల పేర్లు, అంకెలు తీర్చిదిద్దారు. ఆడుకునేందుకు ఆటవస్తువులతో పాటు పరిశుభ్రమైన నీరు తాగేందుకు వాటర్ ప్యూరిఫయ్యర్ ఏర్పాటుచేశారు. అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలను కూడా పచ్చదనంతో తీర్చిదిద్దారు. కేంద్రం బయట గోడలపైనా పిల్లలు సైక్లింగ్ చేస్తున్నట్టు, స్కూల్‌కు వెళుతున్నట్టు చూడముచ్చటగా డిజైన్ వేయించారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 40 మంది చిన్నారులు అభ్యసన పొందుతున్నారు. పిల్లలకు ఆటపాటలతో పాటు ఇంగ్లీష్‌లో మాట్లాడడం కూడా నేర్పిస్తున్నారు. ప్రైవేటు కార్పొరేట్ ప్లేస్కూల్స్‌కు పోటీగా అంగన్‌వాడీ కేంద్రం అందరినీ ఆకట్టుకుంటోంది.



గోడలపై ఆకర్షణీయంగా బొమ్మలు



గోడపై ఇంగ్లీష్ నెలలు

అందరూ వచ్చి బాగుందంటున్నారు..



కె.సునీత, అంగన్‌వాడీ టీచర్

ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియాలోని మా అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దడంతో అందరూ వచ్చి కితాబునిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 40మంది పిల్లలున్నారు. ఇద్దరు ఆయాలు ఉన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ కేంద్రంలో చిన్నారులకు ఆటాపాటలతో పాటు ఇంగ్లీష్, తెలుగు అక్షరాలు, మాటలు, పాటలు నేర్పిస్తున్నాం. ఉదయం 9 గంటలకు పిల్లలను రిసీవ్ చేసుకుని వారికి వెల్‌కమ్ చెబుతాం. ఆ తర్వాత బాయిల్డ్ ఎగ్ ఇస్తాం. పిల్లలకు మంచి అలవాట్లు, ఆటపాటలు నేర్పిస్తాం. మధ్యాహ్నం 12 గంటలకు భోజనం ఏర్పాటు చేసి ఆ తర్వాత గంటపాటు కేంద్రంలోనే పిల్లలను నిద్రపుచ్చుతాం. సాయంత్రం రివిజన్ చేసి, స్నాక్స్ ఇచ్చి 4గంటలకు ఇంటికి పంపుతాం. అంగన్‌వాడీ కేంద్రం ఆహ్లాదకరంగా ఉందని పలువురు కితాబు నిస్తున్నారు. పిల్లలు ఉత్సాహంగా వస్తున్నారు.

గ్రామ పాలన ఆఫీసర్ పోస్టుల మంజూరు పట్ల హర్షం



మంత్రి పొంగులేటిని కలిసి సత్కరిస్తున్న వీఆర్వోల సంఘం నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 10,954 గ్రామ పాలన ఆఫీసర్ పోస్టులను మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం రెవెన్యూ వ్యవస్థలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 10,954 గ్రామ పాలన ఆఫీసర్స్ పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జీవో ఎంఎస్ నెంబరు 41 ద్వారా శనివారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, తుమ్మల నాగేశ్వరరావుకి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌కి, రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను పట్టించుకోని మంత్రులు

» బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



సిరిపురంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

మధిర రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా కానీ రైతులను పట్టించుకొనే నాథుడే కరువయ్యారని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మధిర మండలం సిరిపురం గ్రామంలో కల్లాల్లో ఉన్న మొక్కజొన్నలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మద్దతు ధర ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం కారణంగా మద్దతు ధర అందడం లేదని అన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరావు, బీజేపీ జిల్లా నాయకులు సంతోష్‌రెడ్డి, ఉపేందర్ గౌడ్, నాయకులు పాపట్ల రమేష్, కనకాచారి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌కు విద్యార్థి ఎంపిక

అశ్వారావుపేట రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ రాష్ట్రస్థాయి పోటీలకు అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల రెండో సంవత్సరం విద్యార్థిని కె.లేఖన ఎంపిక అయింది. ఇటీవల ఖమ్మంలో నెహ్రూ యువకేంద్రం, జాతీయసేవా పథకం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ప్రతిభను కనబరిచిన లేఖనను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈసందర్భంగా శనివారం కళాశాలలో విద్యార్థిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ అభినందించారు.

విద్యార్థిని ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే వివిధ రకాల నైపుణ్యాలను తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవాపథకం విభాగం డాక్టర్ రాంప్రసాద్, టి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి లేఖనను అభినందిస్తున్న హేమంత్‌కుమార్

భద్రాచలంలో 'చెత్త' సమస్య తీరినట్లే

» అందుబాటులోకి శాశ్వత డంపింగ్ యార్డు
» నేడు ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి

భద్రాచలం మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గత దశాబ్ద కాలంగా భద్రాద్రివాసులు ఎదుర్కొంటున్న డంపింగ్ యార్డు కష్టాలకు చెల్లుచీటి పడనుంది. భద్రాచలంలోని సుందరయ్యనగర్‌లో తడి, పొడి చెత్త వనరుల సేకరణ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఇక నుంచి భద్రాద్రివాసులకు భారీ ఊరట లభించనుంది. రాష్ట్రంలో ఆధునిక యంత్రాలతో తడి, పొడి చెత్తను పొడిగా మార్చే విధానం ప్రవేశపెట్టిన తొలి గ్రామ పంచాయతీ భద్రాచలమే కావడం విశేషం. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన పీర్జాదిగూడ మునిసిపాల్టీలో ఇదే రీతిన డీఆర్‌సీసీని ఏర్పాటు చేశారు. కాగా శనివారం ఈ కేంద్రాన్ని ఐటీడీఏ పీవో బి.రాహుల్ సందర్శించి తుది దశలో ఉన్న ఏర్పాట్లను పరిశీలించారు. రూ.1.40 కోట్ల అంచనా వ్యయంతో గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త వనరుల సేకరణ కేంద్రాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుతో పాటు ఎంపీ, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఐటీడీఏ పీవో, పంచాయతీ ప్రత్యేక అధికారి బి.రాహుల్ పాల్గొననున్నారు.



తడి, పొడిచెత్తలతో ఇటుకలు తయారీ చేసే మిషన్లు



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న పీవో

భద్రాద్రివాసులకు ఊరట

పోలవరం ముంపు మండలాల పేరుతో ఉమ్మడి జిల్లాలోని ఏడు మండలాలు ఏపీలో విలీనం అనంతరం భద్రాద్రి కరకట్టే డంపింగ్ యార్డుగా మారిన దుస్థితి ఇంతకాలం ఉంది.. దీంతో గత దశాబ్దకాలంగా ఆ ప్రాంతం నిత్యఅగ్నిహోత్రంగా మారింది. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారం దశాబ్ద కాలం తరువాత లభించింది. మనుబోతుల చెరువు సమీపంలో డంపింగ్ యార్డు పనులు పూర్తవడంతో యంత్రాల ద్వారా చెత్తను పొడిగా మార్చే ప్రక్రియను చేపడుతున్నారు. భద్రాచలంలోని మనుబోతుల చెరువు సమీపంలో 8.5 ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ఇందులో 1.5 ఎకరాల్లో డ్రై వేస్ట్ రిసోర్సు కలెక్టింగ్ సెంటర్(బీఆర్‌సీసీ)ని ఏర్పాటు చేయగా ఇందుకోసం రూ.80 లక్షలు వెచ్చించారు. పొడి చెత్తను వేరు చేసి క్రష్ చేసే మిషన్‌ను బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారానికి చెందిన వావ్ స్వచ్ఛంద సంస్థ గ్రామ పంచాయతీకి అందజేసింది. కాగా తడిచెత్తను క్రష్ చేసే మిషన్‌ను రూ.70 లక్షలతో భద్రాచలం గ్రామ పంచాయతీ కొనుగోలు చేసింది. కాగా మిగిలిన ఏడు ఎకరాల్లో భారీగా మొక్కలను పెంచనున్నారు.

పని చేసేది ఇలా....

పట్టణంలో సేకరించిన తడి చెత్త నుంచి తొలుత 80 శాతం నీటిని వెట్‌వేస్ట్ కన్వేయర్ మిషన్ ద్వారా తీసేస్తారు. వచ్చిన పల్ప్‌ను ప్లాట్‌ఫాంలో ఎండబెడతారు. అనంతరం పొడి చెత్తను తీసుకువచ్చి క్రష్ చేసే మిషన్లో వేస్తారు. ఈ క్రమంలో వచ్చిన పౌడర్‌తో ఇటుకలను తయారు చేస్తారు. ఇదిలా ఉండగా వ్యర్థాలతో తయారు చేసిన ఈ ఇటుకలను ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో వంట చెరకుగా వినియోగించేందుకు రంగం సిద్ధం చేశారు.

రోజు 17 టన్నుల తడి చెత్త సేకరణ

భద్రాచలంలో ప్రతి రోజు 17 టన్నుల తడి చెత్తను పంచాయతీ సిబ్బంది సేకరిస్తున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో పొడి చెత్తను నాలుగు టన్నులు సేకరిస్తున్నారు. ఇందు కోసం 17 ఆటోలను, ఆరు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు.

పర్ణశాలలో వేలం పాట

దుమ్ముగూడెం మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పర్ణశాల గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం వాహన పార్కింగ్, బోటు షికారు, మరుగుదొడ్ల నిర్వాహణ ఆసీలు వసూలుకు బహిరంగ వేలం పాటను నిర్వహించారు. వాహన పార్కింగ్ పాటను రూ.61లక్షలకు సీతానగరానికి చెందిన పి.వెంకటరమణ దక్కించుకున్నారు. గత ఏడాది రూ.40లక్షలు కాగా, ఈ ఏడాది ఒక్కసారిగా రూ.21లక్షల అదనపు ఆదాయం లభించింది. బోటు షికారును తెల్లం భీమరాజు రూ.44.40లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.42.40లక్షలు కాగా రూ.2లక్షలు ఎక్కువ పలికింది. మరుగుదొడ్ల నిర్వహణను పొడియం జానకిరాం రూ.85వేలకు దక్కించుకున్నారు. మొత్తం మీద పర్ణశాల గ్రామపంచాయతీకు ఈ ఏడాది వేలంలో రూ22.75 లక్షల అదనపు ఆదాయం లభించింది. ఇన్‌చార్జి ఎంపీడీవో బద్ది రామకృష్ణ, కార్యదర్శులు శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, రంజిత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రెండో రోజు అలరించిన నాటక పోటీలు



కళాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

మధిరటౌన్, మార్చి22(ఆంధ్రజ్యోతి): మరుగున పడిపోతున్న కళలను కళాకారులను బ్రతికించే ప్రయత్నం చేయడం అభినందనీయమని మధిర రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి అన్నారు. మధిరలోని వేంకటేశ్వరస్వామి కల్యాణమండపంలో సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రారంభమైన రెండు తెలుగు రాష్ట్రాల నాటక పోటీలను శనివారం ఆమె ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధిరలో వివిధ కళాపరిషత్ వారు నాటక పోటీలను నిర్వహిస్తూ అంతరించి పోతున్న కళలను బతికిస్తున్నారని ఇది ఎంతో అభినందనీయం అని అన్నారు. రెండో రోజు పలువురు కళాకారులు ప్రదర్శించిన పలు సాంఘిక, పౌరాణిక కళారూపాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గడ్డం శ్రీనివాసరావు, సుబ్బారావు, పుతుంబాక కృష్ణప్రసాద్, మునుగోటి వెంకటేశ్వర్లు, గురువులు, బాబ్లా పాల్గొన్నారు.



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

వైద్య విద్యలో నేహాశివాని ప్రతిభ

» అమెరికన్ యూనివర్సిటీలో జనరల్ మెడిసిన్ విభాగంలో పీజీ సీటు



డాక్టర్ నేహాశివానిని అభినందిస్తున్న తల్లిదండ్రులు నాగేంద్రకుమార్, నీలిమ

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన రాజావాసిరెడ్డి నేహాశివాని అమెరికాలోని వెస్ట్ వర్జీనియ విశ్వవిద్యాలయంలో ఎండీ జనరల్ మెడిసిన్ విభాగంలో పీజీ సీటు సాధించింది. ఖమ్మం వీడీవోస్ కాలనీ రెజోనెన్స్ పాఠశాలలో పదోతరగతి, కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి, విజయవాడలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రభుత్వ సిద్దార్థ మెడికల్ కళాశాల నుంచి 2023లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. అమెరికాలో మెడిసిన్ పీజీ ప్రవేశ పరీక్షకు వివిధ దశలలో నిర్వహించే మెడికల్ లైసెన్సింగ్ ప్రవేశ పరీక్షలలో, ఇంటర్వ్యూలలో ప్రతిభను కనబరిచి మొదటి ప్రయత్నంలోనే పీజీ సీటు సాధించింది. అమెరికాలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఇంటర్న్‌షిప్ చేసుకొని, కార్డియాలజీ, పల్మనాలజీ విభాగాల్లో అనేక పరిశోధన ప్రాజెక్టులు నిర్వహించి అంతర్జాతీయంగా ప్రతిభ చాటుకుంది. నగరంలోని రెజోనెన్స్, సర్వజ్ఞ విద్యా సంస్థల డైరెక్టర్స్ నాగేంద్రకుమార్, నీలిమలు కుమార్తె నేహాశివాని. ఈ సందర్భంగా శివాని మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి ప్రయత్నంలోనే యూఎస్ మెడికల్ లైసెన్సింగ్ పరీక్షలో విజయం సాధించి పీజీ సీటు సాధించడంతోపాటు నెలకు 6000 వేల డాలర్లకు పైగా స్టైఫండ్ పొందడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

7,890 జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తికావడంతో అధికారులు మూల్యాంకనంపై దృష్టిసారించారు. శనివారం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 7,890 జవాబు పత్రాలను మూల్యాంకనం పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు తెలిపారు. మొత్తం 456 మంది అధ్యాపకులకు 421 మంది హాజరైనట్లు తెలిపారు.

బావిలో జారిపడి వ్యవసాయ కూలీ మృతి

నాగులవంచలో ఘటన

చింతకాని,మార్చి22(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో జారిపడి నాగులవంచకు చెందిన కూరపాటి రాంబాయి (54) అనే వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... రాంబాయి ఉదయం 6గంటల సమయంలో పొలం పనికి వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో తాగునీటి కోసం బావి వద్దకు వెళ్లింది. మంచినీరు తోడేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు కాలు జారడంతో బావిలో పడి ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ నాగులమీరా కేసు నమోదు చేశారు.

26న సీపీఐ శతజయంతి ముగింపు ఉత్సవాలు

» రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు
» ఖమ్మంలో 2వేల మందితో ర్యాలీ



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరుగుతున్న సీపీఐ శతజయంతి ఉత్సవాల ముగింపు ఖమ్మం వేదికంగా మారుతుందని, డిసెంబరు 26న జరిగే సభకు జిల్లాలో 2వేలమంది జనసేవాదళ్ కార్యకర్తలను సిద్ధం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ జిల్లా సమితి కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన ప్రజాసంఘాలు, మండల కార్యదర్శులు, పార్టీ బాధ్యుల సమావేశంలో భాగం మాట్లాడుతూ భవిష్యత్ ఉద్యమ కార్యచరణ వివరించారు. ఏప్రిల్ చివరి నాటికి అన్ని ప్రజాసంఘాల మండల మహాసభలు పూర్తి చేయాలని కార్యచరణ తెలిపారు. ఈ సంవత్సరం ఘనంగా నిర్వహించే సీపీఐ శతజయంతి ఉత్సవాల ముగింపు సభ ఖమ్మంలో జరుగుతుందన్నారు. గ్రామ స్థాయిలోని ప్రజా సమస్యలను గుర్తించే అక్కడ నుంచే ప్రజా ఉద్యమాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు సమస్యలను ఏజెండాగా తీసుకొని స్థానికంగానే ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయరంగంపై ఆధారపడిన కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని వారి సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు సింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుకు ప్రమాదం

సత్తుపల్లిరూరల్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్టీసీ అద్దె బస్సును లారీ ఢీకొన్న సంఘటన మండలంలోని కిష్టారం వై-జంక్షన్ వద్ద శనివారం చోటుచేసుకుంది. సత్తుపల్లి ఆర్టీసీ డిపోఅసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి నుంచి ఖమ్మానికి 60మంది ప్రయాణీకులతో అద్దె బస్సు వెళుతోంది. ఈక్రమంలో మండలంలోని కిష్టారం వై-జంక్షన్ వద్దకు చేరుకోగానే జాతీయ రహదారి పక్కనే ఉన్న బంక్‌లోని వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక టైర్ వద్ద దెబ్బతిన్నది. ఆ సమయంలో బస్సులో సుమారు 60మంది ప్రయాణీకులు ఉండగా ప్రాణనష్టం వాటిల్లలేదు. సమాచారం అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు సంఘటనా స్థలానికి చేరుకుని మరో బస్సులో ప్రయాణీకులను పంపారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

» వైరాలో విషాదం



వైరా,మార్చి22(ఆంధ్రజ్యోతి): ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నం వరకు పాఠశాలలో గడిపిన ఓ చిన్నారి.. ఆతర్వాత సరదా కోసం ఈతకు వెళ్లి చనిపోయాడు. శనివారం మధ్యాహ్నం వైరాలో ఈ సంఘటన జరిగింది. వైరా మునిసిపాలిటీ పరిధిలోని బెజ్జం బాలస్వామి, మేరీ సంతానమైన రాబిన్(9)వైరా రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృత్యువాతపడ్డాడు. గత వేసవి కాలంలో ఈ ప్రాంతంలో మట్టి తవ్వకాలు జరిగాయి. భారీ గుంతలు ఉండి రిజర్వాయర్‌లో నీరు చేరింది. నీటిలోతు గురించి తెలియని చిన్నారి ఒడ్డు నుంచి లోపలకు దిగే సమయంలో మృతిచెందాడు. స్థానిక బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న రాబిన్ ఒంటిపూట బడులు అనంతరం స్నేహితులు, చేపలు పట్టే వారివెంట రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లాడు.నీటిలో మునిగిపోయిన రాబిన్‌ను అక్కడున్న వారు వెంటనే బయటకు తీసుకువచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే రాబిన్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి బాలస్వామి వైరా మునిసిపాలిటీలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా తల్లి మేరీ కూలీపనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఏకైక సంతానమైన కుమారుడు రాబిన్ మృతితో ఆదంపతులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో పదోతరగతి విద్యార్థికి గాయాలు

» ప్రథమ చికిత్స అనంతరం పరీక్షకు హాజరు
» తండ్రితో ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదం



కొణిజర్ల, మార్చి22(ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు.. ప్రాథమిక చికిత్స అనంతరం పరీక్షకు హాజరయ్యాడు. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ అసన్ వైయస్‌ఆర్ నగర్‌లో నివాసంఉంటున్నారు. వెంకటాయపాలెం విద్యార్థులు 39మంది తనికెళ్ళలోని రెండు పరీక్ష కేంద్రాలలో పరీక్ష రాస్తున్నారు.అసన్ సెయింట్ అలోసీయేస్ కేంద్రంలో పరీక్షను రాస్తున్నాడు. వైయస్‌ఆర్‌నగర్‌లో ఉంటున్న అసన్ తన తండ్రీ జానిమీయాతో కలిసి ద్విచక్రవాహనంపై హిందీ పరీక్ష రాసేందుకు వస్తున్నాడు. వెంకటాయపాలెం సమీపం దగ్గరకు వచ్చే సమయంలోనే ఎదరుగా వస్తున్న ఆటో వీరి వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. తండ్రికి తల వద్ద గాయాలు కాగా కుమారుడు అసన్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. పరీక్ష ఉండటంతో తండ్రి తన భార్యకు సమాచారం ఇచ్చాడు. ఆమె కుమారుడుని తీసుకొని పరీక్షాకేంద్రానికి చేరుకుంది.అసన్ పరీక్ష రాస్తుండగా వాంతులు చేసుకున్నాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లాల్‌మహ్మద్ 108కు ఫోన్ చేశారు. ఏఎన్ఎం, విద్యార్థి తల్లి కొణిజర్లలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. మరల అదే 108 ద్వారా పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం విద్యార్థి పరీక్షను రాశాడు.

సేద తీరేందుకు ఆగి, మృత్యుఒడికి

ఇల్లెందురూరల్,మార్చి22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఇల్లెందు మండలం జెండాలవాగు సమీపంలో శనివారం జరిగింది. ఇల్లెందు పోలీసుల కథనం ప్రకారం.. గార్ల మండలం దేశ్యతండాకు చెందిన వాంకుడోత్ కిషన్(50) ద్విచక్ర వాహనంపై భార్య అమలతో కలిసి ఇల్లెందులో ఉంటున్న తన కుమారుడు సురేందర్ ఇంటికి వెళుతున్నాడు. ఈక్రమంలో మహబూబాద్-ఇల్లెందు ప్రధాన రహదారిలో ఇల్లెందు మండలం జెండాలవాగు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని రోడ్డు ప్రక్కన చెట్టు నీడలో నిలిపి ఉంచాడు. ఈక్రమంలో వెనుక నుంచి బొలేరో వాహనం కిషన్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అమల త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకుంది. ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి ఉత్తరప్రదేశ్ వ్యక్తి మృతి

మధిరరూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని రైలు కింద ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. రైల్వేపోలీసుల వివరాల ప్రకారం.. మధిర మండలం మధిర-తొండలగోపవరం రైల్వేస్టేషన్ల మధ్య డౌన్ మెయిన్‌లైన్‌పై గుర్తుతెలియని రైలు కింద పడి ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇంద్రజిత్(41) మృతిచెందాడు. రైలులో ప్రయాణిస్తుండగా ప్రమదవశాత్తు ఆయన రైలు కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి ఆర్కేపొండేషన్ దోర్నాల రామకృష్ణ సహకారంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శబ్దకాలుష్యంపై జరిమానా



సైలెన్సర్లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ఖమ్మంక్రైం,మార్చి22(ఆంధ్రజ్యోతి): బుల్లెట్ వాహనాలకు సైలెన్సర్లను తొలిగించి సొంత సైలెన్సర్లు ఏర్పాటు చేసుకుని శబ్ద కాలుష్యం కలిగిస్తున్న 20మంది వాహనదారులకు శనివారం ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మోడిఫైడ్ సైలెన్సర్లతో నడిపే బుల్లెట్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కొందరు యువకులు వాహనాలనకు సంబంధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్చి వింత శబ్దం వచ్చే వాటిని అమర్చి రోడ్లపై అకస్మాత్తుగా శబ్దాలు చేడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు అందులో భాగంగా ఈరోజు 20మోడిఫైడ్ సైలెన్సర్ల వరకు తొలిగించిన ఒక్కోవాహనదారుడికి రూ.1000 జరిమానా విధించామని తెలిపారు. ఇప్పటికే సుమారు 300మోడిఫైడ్ సైలెన్సర్ల వరకు తొలిగించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి, సాగర్‌పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

పాల్వంచ, మార్చి22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పాల్వంచ టౌన్ పోలీసులు శనివారం సీజ్ చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని శ్రీనివాసకాలనీ ముర్రేడువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం అందుకున్న పాల్వంచ టౌన్ ఎస్ఐ సుమన్ స్వయంగా అక్కడకు చేరుకుని ట్రాక్టర్లను సీజ్ చేశారు. స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు డ్రైవర్లు, ముగ్గురు యజమానులపై కేసు నమోదు చేశారు.



నోటరీ న్యాయవాదసంఘ కార్యవర్గం ఎన్నిక



ఖమ్మంలీగల్,మార్చి22(ఆంధ్రజ్యోతి): జిల్లానోటరీ న్యాయవాదులసంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పారుపల్లి అమర్‌చంద్, ఉపాధ్యక్షుడిగా తోటకూరి శ్రీనివాసరావు, కన్నేటి వెంకట రామణారావు, నెలిబండ్ల రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా కొండపల్లి శ్రీనివాస్‌చౌదరి, సంయుక్త కార్యదర్శులుగా రాజవరం నారాయణస్వామి, బొడ్డు రాములు, కోశాధికారిగా మందా రెడ్డెయ్య ఎన్నికయ్యారు. ఈసీ సభ్యులుగా తెల్లాకుల రవికిరణ్, సిద్ధిక్‌అలీ, పాలవెల్లి వెంకటేశ్వర్లు, ఎండీ అన్సారీ, చెంగల వెంకటరమణారావు, గౌరవ సలహాదారుగా కొల్లి సత్యనారాయణను ఎన్నుకున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఖమ్మం ముందడుగు

» మూడు నుంచి రెండో స్థానానికి
» వరంగల్ తర్వాత ఖమ్మం, ఆ తర్వాత హైదరాబాద్

ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 అవార్డు పోటీలో ఖమ్మం నగర పాలక సంస్థ దూసుకుపోతుంది. అవార్డు కైవసంలో కీలకంగా 750 మార్కులు సాధించే సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో రోజు రోజుకు ముందు వరసలో వెళ్తోంది. సిటిజన్ ఫీడ్‌బ్యాక్ ప్రారంబంలో ఖమ్మం నగర పాలకసంస్థ నాలుగో స్థానంలో ఉంది. తర్వాత వరంగల్, హైదరాబాద్ తర్వాత మూడో స్థానంలోకి చేరింది. అయితే రెండు రోజులుగా ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించారు. కార్పొరేటర్లు, మెప్మా డీఎంసీ, టీఎంసీ, సీవోలు, ఆర్పీలు, పారిశుధ్య ఉద్యోగులు, కేఎంసీ కార్యాలయం ఉద్యోగులు విశేషంగా ప్రచారం కల్పించారు. దీంతో శనివారం కేఎంసీ సిటిజన్ ఫీడ్ బ్యాక్ 19,706కు చేరింది. 80వేలకు పైగా సిటీజన్ ఫీడ్‌బ్యాక్‌లో వరంగల్ మొదటి స్థానంలో నిలవగా ఖమ్మం నగర పాలక సంస్థ 19,706 ఫీడ్ బ్యాక్‌లతో రెండో స్థానంలో నిలిచింది. 19,556 ఫీడ్‌బ్యాక్‌లతో హైదరాబాద్ మూడో స్థానంలో చేరింది. అయితే జనాభా ప్రాతిపదికన 50వేల పాజిటీవ్ ఫీడ్‌బ్యాక్‌లు కేఎంసీకి ఓటింగ్ జరిగితే 750 మార్కులు స్వచ్ఛ సర్వేక్షణ్ ఖాతాలో చేరతాయి.

పోటీలో వెనుకబడిన ఉమ్మడి జిల్లా మునిసిపాలిటీలు

ఖమ్మం జిల్లాలో ఇతర మునిసిపాలిటీలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు పోటీలో చాలా వెనుకపడ్డాయని తెలుస్తోంది. కొన్ని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పారిశుధ్య కార్మికుల కూడా సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఓటింగ్‌లో పాల్గొనలేదని ఓటింగ్ సరళి తెలుపుతుంది. మధిర మున్సిపాలిటీ 667 సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లు, సత్తుపల్లి 18 సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లు, వైరా 45 ఫీడ్‌బ్యాక్‌లతో రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో చివరిస్థానంలో నిలిచాయి. కొత్తగూడెం మున్సిపాలిటీ 1153, మణుగూరు 2,135, పాల్వంచ 155, ఇల్లెందు 2,950 సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లు ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదు జరిగాయి.

విపత్తులను ఎదుర్కొనేందుకు కేఎంసీకి డ్రోన్



డ్రోన్‌ను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులతో పాటుగా అత్యవసర సమయంలో వినియోగానికి, అక్రమ కట్టడాలు గుర్తించేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ డ్రోన్ కొనుగోలు చేసింది. మున్నేరుకు వచ్చిన వరదలు ఇతర అవసరాల నేపథ్యంలో రూ.5 లక్షలతో ఖమ్మం నగర పాలక సంస్థకు 10కేజీల సామర్థ్యం కలిగిన డ్రోన్‌ను కొనుగోలు చేశారు. శనివారం డ్రోన్ పనితీరును మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. అత్యవసర సమయంలో డ్రోన్ సేవలు ప్రజలకు ఉపయోగపడ్తాయని పేర్కొన్నారు. పదికేజీల బరువైన వస్తువులును, ఆహారాన్ని డ్రోన్ ద్వారా తీసుకెళ్లే వీలు కలుగుతుందన్నారు.

'సదరం'లో సౌకర్యాలు కల్పించాలి

» కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
» క్యాంప్ ఏర్పాట్లపై ప్రధాన ఆసుపత్రి సందర్శన



మృణాల్‌శ్రేష్టను సత్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన అదనపు కలెక్టర్లు

ఖమ్మంకలెక్టరేట్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సదరం క్యాంప్ నిర్వహణ సమయంలో దివ్యాంగులకు అవసరమైన వసతులను కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు.. శనివారం జిల్లా ప్రధాన ఆసుపత్రి వద్ద ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దివ్యాంగులకు అందించే యూడీఐడీ కార్డులు మన రాష్ట్రంలో మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా ఉపయోగపడతాయని, ఈ. కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఆసుపత్రిలో నిర్ధారణ పరీక్ష కోసం సదరం స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్ కుమార్,ఆర్ఎంవో రాంబాబు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ నిషేధం

రెండు వారాల్లో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డి, శిక్షణ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠతో కలిసి పరిపాలనకు సంబంధించి వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. వచ్చేవారం నుంచి గర్ల్ ఫ్రైడ్ పర్యటనలు ప్రారంభం కావాలన్నారు. జిల్లాలో ఆడపిల్లలు పుట్టిన ఇళ్లకు జిల్లా అధికారులు వెళ్లి, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్‌బాక్స్, జిల్లా యంత్రాంగం తరుపున చిన్న సందేశం అందించి రావాలన్నారు. 10వతరగతి పరీక్షల నేపథ్యంలో సాయంత్రం జిల్లా అధికారులు విద్యార్థుల ఇంటికి వెళ్లి విద్యార్థి పరీక్షల సన్నద్ధతను గమనించాలని అన్నారు. జిల్లా కలెక్టరేట్‌ను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, క్యాంటీన్‌లో కూడా ప్లాస్టిక్ కాకుండా స్టీల్ వస్తువులు మాత్రమే వాడాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్వో ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో అరుణ, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ కలెక్టర్‌కు వీడ్కోలు

శిక్షణ కలెక్టర్‌గా మృణాల్ శ్రేష్ఠసేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మృణాల్ శ్రేష్ఠ వీడ్కోలు, సన్మాన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లుపి. శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్క సివిల్ సర్వెంట్ 9 నెలల నుంచి 12 నెలల వరకు శిక్షణ కలెక్టర్‌గా పని చేస్తారని అన్నారు. సివిల్స్ పరీక్షల్లో ఎంపికైన తర్వాత మొదటి రోజు ట్రెయినీ కలెక్టర్ గా వచ్చినప్పుడు తనకు చాలా భయం వేసిందని కలెక్టర్ తన జ్ఞాపకాలను గుర్తు చేశారు. సెప్టెంబరులో భారీ వరదల సమయంలో ప్రజలకు ఆహారం, తాగునీరు సరఫరా చేయడంలో ట్రెయినీ కలెక్టర్ కీలక పాత్ర పోషించారన్నారు. మోడల్ అంగన్‌వాడి కేంద్రాల ఏర్పాటు, పాఠశాలల్లో గార్డెనింగ్ ఏర్పాటు, 200 మంది పిల్లలకు ఉపయోగపడేలా కోడింగ్ ల్యాబ్ ఏర్పాటు, లైబ్రరీ నిర్మాణం, మహిళా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కంప్యూటర్ల శిక్షణ, ఐటీ ల్యాబ్ ఏర్పాటు, పిల్లలకు ఐటీ శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారని కలెక్టర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా చేయడం తన అదృష్టమన్నారు. పరిపాలనకు కావల్సిన అంశాలను కలెక్టర్, ఖమ్మం ఉన్నతాధికారుల, ప్రభుత్వ సిబ్బంది నుంచి నేర్చుకున్నా అని అన్నారు. ఈ వీడ్కోలు సమావేశంలో జెడ్పీ సీఈవో దీక్షారైనా, డీఆర్వో ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏఓ. అరుణ,జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎంసీలో ఫేస్ ఐడీ హాజరు

ఆధునిక పరికరాల ఏర్పాటు

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగులు పనితీరును గాడిలో పెట్టేందుకు కమిషనర్ అభిషేక్ అగస్త్య బయో ఫేస్ హాజరు యంత్రాలను శనివారం ఏర్పాటు చేయించారు. కేఎంసీలో ఏ బ్లాక్‌లో 2, బీ బ్లాక్ 2 ఏర్పాటు మిషన్లు ఏర్పాటు చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో రెగ్యూలర్ ఉద్యోగులు 260 మంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 1,000 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సాధారణ హాజరుతో పాటుగా బయో మెట్రిక్ హాజరు అమలులో ఉన్నా పూర్తి స్థాయిలో అమలు కావటం లేదని కమిషనర్ విచారణలో నిరూపణ జరిగింది. దీంతో ఆధునాతన సాంకేతికత కలిగిన ఫేస్‌ఐడీ హాజరు మిషన్లు ఏర్పాటు చేయించారు.

నేడు ఏదులాపురంలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంరూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల గ్రామాల్లో ఆదివారం రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, రూరల్ మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రెండు రోజుల్లో అన్ని సర్వీసులు అందుబాటులోకి..

» తాగునీరు, శానిటేషన్‌పై ప్రధాన దృష్టి
» ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



ఖమ్మంరూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి): రెండురోజుల్లో అన్నిసర్వీసులు అందుబాటులోకి వస్తాయని ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటి పరిధిలోని పెద్దతండా లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జనన, మరణ ధ్రువీకరణ పత్రాల సర్వీసులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఒకటి రెండు రోజుల్లో ఇళ్లకు సంబంధించిన సమాచారం పోర్టల్‌లోకి వస్తుందన్నారు. దానికి అనుగుణంగా పర్మిషన్లు ఇస్తామన్నారు. మున్సిపాలిటి పరిధిలోని సిబ్బందికి శిక్షణ ఇస్తూ, బాధ్యతలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న పంచాయతీ భవనాల వద్ద అధికారుల ఫోన్ నెంబర్లు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామని, ఎండాకాలం నేపథ్యంలో ప్రధానంగా డ్రింకింగ్ వాటర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. శానిటేషన్ లైటింగ్ పై కూడా దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. ఏదైనా బిజీలో ఉండి సంబంధిత అధికారులు స్పందించకపోతే పెద్దతండాలోని తన కార్యాలయం వద్దకు రావాలని ప్రజలకు సూచించారు. ప్రజలకు అన్ని రకాల సర్వీసులు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రెవిన్యూ అండ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కె.శ్రీధర్ రెడ్డి మేనేజర్ మనీ, అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరిని కలిసిన బీజేపీ నేతలు

ఖమ్మంబైపాస్‌రోడ్, మార్చి22(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన నెల్లూరి కోటేశ్వరరావు నగరంలోని పలువురు బీజేపీ సీనియర్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ముందుగా బీజేపీ రాష్ట్ర నాయకుడు సన్నె ఉదయ్‌ప్రతాప్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డిని తన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమిలి శ్రీనివాస్, ఉపేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జరిమానాల్లో వ్యత్యాసమా?



ఆటోను నిలుపుదల చేసిన పారిశుధ్య పర్యవేక్షకులు అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఖమ్మం నగరంలోని ఓ దేవాలయం వద్ద కొబ్బరి కాయలు అమ్మకాలు జరుపుతున్న ఓ చిరువ్యాపారి వద్ద ప్లాస్టిక్ కవర్ కనిపించిందని ఆ మహిళ కన్నీరు పెట్టుకున్న కేఎంసీ అధికారులు కనికరించలేదు. రూ.2వేలు జరిమానా విధించి తక్షణం వసూళ్లు చేశారు. శనివారం ఖమ్మంలోని ఓ ప్రముఖ బిస్కెట్లు, ప్యాకెట్ మసాల అమ్మకాల వ్యాపారి గడువు ముగిసిన పదార్థాలను కనీస సమాచారం లేకుండా ఖమ్మం డంపింగ్‌యార్డులో కలిపేందుకు ఆటోలో వెళ్లాడు. విషయం తెలుసుకున్న పారిశుధ్య సిబ్బంది పైస్థాయిలోని అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న అధికారులు విష పదార్థాల నిల్వల తరలింపు మేరకు జరిమానా విధించలేదు. కేవలం రూ.2వేలు నామమాత్రపు జరిమానా విధించారు. జరిమానా తగ్గింపు వెనుక కార్పొరేటర్ల సిఫారసులు ఉన్నాయని తెలుస్తోంది. చిరు వ్యాపారులకు ఒక జరిమానా, బడా వ్యాపారులకు తగ్గింపు జరిమానాపై ఖమ్మంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పరీక్ష కేంద్రాల బందోబస్తు పరిశీలన



బందోబస్తును పరిశీలిస్తున్న ఏడీసీపీ

ఖమ్మంక్రైం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసుబందోబస్తు ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ ప్రసాదరావు శనివారం పరిశీలించారు. ఖమ్మం పోలీసుకమిషనరేట్ పరిధిలోని 97కేంద్రాల్లోకొనసాగుతున్నాయి. బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలుచేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమల్లో ఉన్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్సు సెంటర్లు, స్టేషనరీ షాపులు ఆయా సమయాల్లో మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బెట్టింగ్ యాప్‌లపై అవగాహన సదస్సు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ వెంటేశ్ హాజరయ్యారు. విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ జీ. ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్స్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మంకలెక్టరేట్,మార్చి22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ క్యాలెండర్‌ను శనివారం టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. టీఎన్జీవోస్ భవన్లో నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.మరియమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా నాయకులు జైపాల్ విజయ్‌కుమార్, తాళ్లూరి శ్రీకాంత్, భూస చంద్రశేఖర్, శ్రీధర్ సింగ్, బి.వి సుబ్బమ్మ, ఎన్.సుశీల ఆర్. సామ్రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వమించారు. ఇటీవల టూటౌన్ పోలీస్ పరిధిలో గుర్తు తెలియని యాచక వృద్ధుడు మృతిచెందాడు. ఈ మృతదేహాన్ని పోలీసులు ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆ మృతదేహం కోసం ఎవరు రానందున పోలీసులు అన్నం శ్రీనివాసరావుకు అప్పగించారు. ఆయన బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

శోభాయమానంగా చక్రస్నానం



ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని పదోడివిజన్ చైతన్యనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రతిష్ఠమహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం పళ్లివేట కార్యక్రమం నిర్వహించారు. ఆలయం నుంచి వైరారోడ్‌లో శోభాయయాత్ర నిర్వహించారు. అనంతరం పార్కులో పళ్లివేట నిర్వహించి ఆరాట్టు పూజను(చక్రస్నాం)శోభాయాత్రగా వెళ్లి వేపకుంట్ల వెంకటాయపాలెం సాగర్‌కాలువ డీప్‌కట్ వద్ద నిర్వహించారు. కేరళ నంబూద్రీలు ఈ వేడుక నిర్వహించారు. ఉదయం ఆలయంలో మేలుకొలుపు, గోమాత దర్శనం, మహాగణపతి హోమం, మృత్యుంజయ హోమం, అభిషేకం కలశపూజ ధ్వజావరోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా 'స్మార్ట్‌కిడ్జ్' వార్షికోత్సవం





జ్యోతిప్రజ్వల చేస్తున్న విజయ్‌బాబు, పాఠశాల యాజమాన్యం, చిన్నారుల నృత్యాలు

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి22(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల 13వ వార్షికోత్సవం శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ మువ్వా విజయబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఫేమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, ట్రస్మా అధక్షుడు కాంతారావు, పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్య హాజరై జ్యోతి ప్రజ్వల నిర్వహించారు. విద్యార్థుల మనోభావాలను అనుగుణంగా విద్యను అందించటం ద్వారా వారిలో చురుకుదనం పెరిగి ఉత్తమంగా రాణించగలుగుతారన్నారు. మార్కుల కోసం కాకుండా జ్ఞాన సముపార్జనకు పాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు

ఖమ్మంసంక్షేమ విభాగం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలైనా ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయటంలో విఫలమైందని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా నాయకులు ఇమ్మడి వెంకటేశ్వర్లు ఆరోపించారు. శనివారం ఖమ్మం నగరంలో నిర్వహించిన డివిజన్ సభలో మాట్లాడారు. చేయూత పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఆసర పింఛన్లు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ఒక్కపింఛన్ మంజూరు చేయలేదన్నారు.ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే బీఆర్ఎస్‌కు పట్టినగతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. అసర పింఛన్‌దారుల కోసం27న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రకటించారు. ములకలపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు కె.శ్రీనివాస్,భరత్, ధరణ్ కృష్ణ, నాగయ్య, వెంకన్న, నర్సింహారావు, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇమ్మిడి వెంకటేశ్వర్లు

రాములోరి ముత్యాల తలంబ్రాలకు విశేష స్పందన

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటికే అందించనున్న కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల కార్గో మేనేజర్ వి. రామారావు శనివారం తెలిపారు. రెండు ముత్యాలతో కూడిన కల్యాణ తలంబ్రాలను రూ.251లకే ఇంటి వద్దకు చేరుస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారం రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 3000ల మంది భక్తులు ముత్యాల తంబ్రాలను కార్గో సేవలు ద్వారా బుక్ చేసుకున్నారని తెలిపారు.

బీసీల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

బీసీ జేఏసీ చైర్మన్ వెంకటరమణ యాదవ్

ఖమ్మంచర్చికాంపౌండ్,మార్చి22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కలిపించినందున కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్రవేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ పెరుగు వెంకటరమణ యాదవ్ కోరారు. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కలిపించినందుకు శనివారం కేంద్ర గ్రంథాలయంలో మిఠాయిలు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో చేకూరి చైతన్య, జి.నరేందర్, తీగల రాము పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 34 మంది గైర్హాజరు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శనివారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు ఖమ్మం జిల్లాలో 34మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. మొత్తం 16,386 మంది విద్యార్థులకు గాను 16,352మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఎనిమిది పరీక్ష కేంద్రాలను డీఈవో, 37 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం, మార్చి22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తిరుమలాయపాలెంలో ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేయాలని అఖిలపక్షపార్టీల ఆధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీను అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశంలో ఆర్.శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, కొమ్ము వీరబాబు మాట్లాడారు. తిరుమలాయపాలెం గ్రామంలో ఐటీఐ కాలేజీకి అనువైన స్థలం ఉందన్నారు. మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని, మాతాశిశు కేంద్రం, ఆర్టీసీబస్టాండ్‌తో పాటు మహిళ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో సమస్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్పందించకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈసమావేశంలో ఎస్.వెకంటేశ్వర్లు రమేష్, వీరస్వామి, బాలాజీ, వెంకటేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



నేడు పెద్దబీరవల్లికి జాన్‌వెస్లీ రాక

బోనకల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బోనకల్ మండలం పెద్దబీరవల్లి గ్రామానికి ఆదివారం సాయంత్రం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రానున్నారని ఆ పార్టీ మండల కార్యదర్శి కిలారు సురేష్ తెలిపారు. జాతీయ విప్లవకారుడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా నిర్వహించే సభకు ఆయన హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైల్వేలైన్ భూముల సర్వే

బోనకల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటమర్రిలో బోనకల్ నుంచి విష్ణుపురం వరకు గూడ్సు రైళ్ల నడిచేందుకు గానూ రైల్వేలైన్ వేసేందుకు శనివారం భూముల సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ పున్నమ్ చందర్ ప్రారంభించారు. బోనకల్ నుంచి మోటమర్రి రైల్వే స్టేషన్ వరకు 53 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంటుందని, మోటమర్రి, ఆళ్లపాడు, గోవిందాపురం(ఎ) గ్రామాలకు చెందిన భూములు గుర్తించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రైల్వే ట్రాక్‌పై ప్రత్యేక బ్రిడ్జి ఏర్పాటు చేసి రైళ్ల రాకపోకలు సాగించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 1500 కోట్ల నిధులు మంజూరు చేసినందున మోటమర్రిలో బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ రాజీవ్ రంజన్, సర్వే అధికారులు కృష్ణమూర్తి, భరత్ షెకావత్, జితేందర్ గోస్వామి, గిర్దావర్ నవీన్ తదితరులున్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు: డీఈ

చింతకాని, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో పలు వీధుల్లో లో-ఓల్టేజ్ సమస్య ఏర్పడటంతో రూ.10 లక్షలతో అదనంగా నాలుగు నూతన విద్యుత్ నియంత్రికలను ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు డీఈ నంబూరి రామారావు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ తిలక్, ఏఈ ఉమామహేశ్వరి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, అంబటి శాంతయ్య, రౌతు అప్పారావు, ఎల్లంపల్లి సతీష్, అనగాని ఎల్లయ్య, మైలవరపు లింగయ్య, బండి రామకృష్ణ పాల్గొన్నారు.

వేసవిలో కార్మికులు జాగ్రత్తగా ఉండాలి

సత్తుపల్లిరూరల్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఈ వేసవి దృష్ట్యా అనారోగ్యాలకు గురికాకుండా ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి ప్రధాన ఆస్పత్రి డాక్టర్ లలిత కోరారు. శనివారం కిష్టారం ఓసీలోని ఉద్యోగులు, కేఎల్‌పీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆమె వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీవో ఎంవీ.నరసింహారావు, మేనేజర్ రామకృష్ణ, భరణి, శ్రీనివాస్, సందీప్ ఉన్నారు.

'ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలి'

వైరా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదలతో ధర్మసోత్ మోతీకుమార్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆకాంక్షించారు. శనివారం దత్తసాయి మందిరంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ మురళీకృష్ణ రూ.పదివేల విలువైన ట్రావెల్ బ్యాగ్‌ను మోతీకుమార్‌కు అందజేశారు. ఉండ్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, పెనుగొండ ఉపేంద్రరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల కృష్ణమూర్తి, మరికంటి రాంగోపాల్, నూకల ప్రసాదరావు, కొల్లా రాంబాబు, మాదినేని సునీత, చింతోజు నాగేశ్వరరావు, వై.బుచ్చిరామారావు, చెరుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మధిరటౌన్, మార్చి22(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని ముస్లిం కాలనీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను టౌన్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న మధిర టౌన్ ఎస్ఐ, ట్రైనీ ఐపీఎస్ రుత్విక్‌సాయి సిబ్బందితో దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 4,140 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే మధిర పట్టణంలో అనధికారంగా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్ట్ షాపులపై దాడి చేసి వారి నుంచి 54 క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్ల కొండ, శివ, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

కిరణ్ ఆశయాలు సాధించాలి

తల్లాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల కోసం పోరాడిన ఉద్యమనేత కిరణ్ అని ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. లాల్‌మియా అన్నారు. శనివారం తల్లాడ మండలం నర్సింహారావుపేటలో యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిరణ్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభలో లాల్‌మియా మాట్లాడుతూ కిరణ్ సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. కిరణ్ అందించిన పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు బలరాం, సైదులు, పాపిరెడ్డి, రాంబాబు, ఉపేందర్, కోటయ్య, అఖిల్‌చంద్ పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు తగ్గించారు..!

» రూ.12కోట్లతో మధిర-జగ్గయ్యపేట రోడ్డు అభివృద్ధి పనులు

వైరా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డు నిర్మాణంలో వెడల్పు తగ్గించి ఇంకా కొంతదూరం పొడవు పెంచుతూ పనులు జరుగుతున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో ఈ చేర్పులు, మార్పులను ఆర్‌అండ్‌బీ అధికారులు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023లో వైరా నుంచి 1.8కిలోమీటర్ల మధిర-జగ్గయ్యపేట రోడ్డులో నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి, డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్ నిర్మాణాలకు రూ.12కోట్లు మంజూరయ్యాయి. అయితే ఆతర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండు,మూడు నెలలపాటు ఈ రోడ్డు అభివృద్ధిపై డోలాయమాన పరిస్థితి నెలకొంది. ఈ పనులను ఆపివేయాలని ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు కూడా వచ్చాయి. ఆతర్వాత 2024 మార్చి, ఏప్రిల్‌లో ఈ పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఎట్టకేలకు ఆపనులు మొదలై పది నెలలైనా ఇంకా నత్తనడకను తలపిస్తున్నాయి.



కొనసాగుతున్న రోడ్డు నిర్మాణం

వైరా నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే జాతీయ రహదారి 2.6కిలోమీటర్ల దూరం ఉంది. అయితే రూ.12కోట్లతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులు 1.8కిలోమీటర్ల వరకే చేయాల్సి ఉంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి వైరా-సోమవరం మధ్య సర్వీస్ రోడ్డు కూడా నిర్మిస్తున్నారు. వైరా నుంచి జగ్గయ్యపేట వెళ్లే జాతీయ రహదారిపైనుంచే గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్తుండటంతో ఇక్కడ సర్వీస్ రోడ్లు నిర్మించారు. దాంతో వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు 2.6కిలోమీటర్ల దూరం ఉండటంతో అక్కడి వరకు నాలుగువరుసల రోడ్డును నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న నిధుల సర్దుబాటుతోనే ఈపనులను పూర్తిచేయాలని స్పష్టం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్డు నుంచి తల్లాడ, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాల వారు హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగించేందుకు ఈ నాలుగువరుసల రోడ్డు ఉపయోగంగా ఉండేందుకు అక్కడి వరకు నిర్మాణాన్ని పూర్తిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

పెరిగిన రహదారి పొడవు

వైరాలోని క్రాస్‌రోడ్డు నుంచి 1.8కిలోమీటర్ల వరకు 16మీటర్ల వెడల్పుతో 52.8అడుగులతో నాలుగు వరుసల రోడ్డు నిర్మించాల్సి ఉంది. అంటే డివైడర్‌కు రెండువైపులా ఎనిమిదేసి మీటర్లు(26.4 అడుగుల)చొప్పున నిర్మించాల్సి ఉంది. అయితే 1.8కిలోమీటర్ల నుంచి 2.6కిలోమీటర్ల వరకు నాలుగు వరుసలుగా నిర్మించేందుకు చర్యలు చేపట్టడంతో వెడల్పును తగ్గించారు. అంటే 16మీటర్ల రోడ్డును కాస్తా 15మీటర్లు(49.5అడుగులు)గా నిర్మించేందుకు పనులు చేస్తున్నారు. అంటే డివైడర్‌కు ఒక్కోవైపు 7.5మీటర్లు(24.75అడుగులు)చొప్పున వెడల్పును తగ్గించారు. ఈ రోడ్డు వెడల్పు తగ్గటం వలన అదనంగా 800మీటర్ల దూరం నాలుగువరుసల రోడ్డును నిర్మించేందుకు అవకాశం ఏర్పడిందని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. అయితే ముందుగా అనుకున్నట్లు డ్రెయినేజీల నిర్మాణం లేదని సమాచారం. కేవలం డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్ మాత్రమే ఉండనుంది.

సత్వర న్యాయంతోనే మహిళలకు భరోసా

» జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే.ఆయేషా షరీన్



మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తున్న న్యాయాధికారి ఆయేషా షరీన్

సత్తుపల్లి, మార్చి22 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల్లో సత్వరమే న్యాయం అందించి భరోసా కల్పిస్తున్నట్లు సత్తుపల్లి కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే.ఆయేషాషరీన్ అన్నారు. సత్తుపల్లి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు స్థానిక గుడిపాడు రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లైక ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 మంది మహిళలకు కుట్టుమిషన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం, శాసనాల స్ఫూర్తిని కాపాడటంలో న్యాయవ్యవస్థది ముఖ్యమైన పాత్ర అని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే.రహమాన్‌బీ, దౌలతున్నీసా, న్యాయవాదులు ఎస్‌కే.ముజీసాహెబ్, కూకలకుంట రవి, కృష్ణప్రసాద్, మున్వర్‌హుస్సేన్, మహబూబ్‌పాషా, సన్నీ, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వన్ నేషన్, వన్ ఎలక్షన్‌తో డబ్బు, సమయం ఆదా

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

కొణిజర్ల, మార్చి22(ఆంధ్రజ్యోతి): వన్ నేషన్, వన్ ఎలక్షన్‌తో డబ్బు, సమయం ఆదా అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు తెలిపారు. మండలకేంద్రమైన కొణిజర్లలో శనివారం జరిగిన వన్ నేషన్, వన్ ఎలక్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనే సంస్కరణ భారతదేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బండారు నరేష్, నల్లగుట్ట ప్రవీణ్‌కుమార్, జిల్లా దళిత మోర్చా ప్రధానకార్యదర్శి చిన్నకృష్ణ, మండడపు సుబ్బారావు, రవీందర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు



ఏసీపీకి కరపత్రాలు అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి తలంబ్రాలను రూ.151చెల్లించి ఇంటివద్దకు పొందవచ్చునని ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్‌కే.మునీర్‌పాషా, వీబీవో కిన్నెర ఆనందరావులు కోరారు. ఈ సందర్భంగా శనివారం కల్లూరు ఏసీపీ ఏ.రఘుతో పాటు పలు కార్యాలయాలలో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో అందిస్తున్న తలంబ్రాల కోసం ఎస్‌కే.మునీర్ పాషా (98664 02129), వీబీవో కిన్నెర ఆనందరావు (9866619189), సత్తుపల్లి (9154298594), అశ్వారావుపేట (9494232424), కల్లూరు (8688972823), వీఎం.బంజర (7382858372), అన్నపురెడ్డిపల్లి (970 1573644) ఆర్టీసీ బస్టాండ్లను సంప్రదించాలని కోరారు.

పంటలకు నీరందించడంలో ప్రభుత్వం విఫలం

» జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్



రైతులతో మాట్లాడుతున్న కమల్‌రాజ్

మధిర రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటపొలాలకు నీరందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ విమర్శించారు. శనివారం మండలంలోని సాయిపురం గ్రామంలో నీళ్ల లేక ఎండిపోయిన వరి, మొక్కజొన్న పంటలను కమల్‌రాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుల బృందం పరిశీలించారు. అనంతరం కమల్‌రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. మధిర నియోజకవర్గంలో చివరి భూములకు నీళ్లందక రైతులు సాగుచేసిన మొక్కజొన్న, వరి పంటలు నిలువునా ఎండిపోతున్నాయన్నారు. రైతుల ప్రభుత్వంగా మాటలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వయానా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే పరిస్థితి ఈవిధంగా ఉండటం దారుణమన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతుల పంటపొలాలకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, కటికల సత్యనారాయణరెడ్డి, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, యన్నంశెట్టి అప్పారావు, రామిరెడ్డి, తుమ్మా వీరారెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పీఎం కిసాన్ లబ్ధిదారుల ధృవీకరణ తప్పనిసరి

» ఏడీఏ స్వర్ణ విజయచంద్ర

చింతకాని, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ లబ్ధిదారుల భౌతిక ధృవీకరణ తప్పనిసరి నమోదు చేయించుకోవాలని ఏడీఏ స్వర్ణ విజయచంద్ర అన్నారు. మండల పరిధిలోని పాతర్లపాడు, చింతకాని, రేపల్లెవాడ గ్రామాల్లో పీఎం కిసాన్ భౌతిక ధృవీకరణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారుల ఫోటో సేకరణ, వివరాల నమోదును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం బోనకల్ మేజర్ ఆయకట్టును పరిశీలించి రైతులతో మాట్లాడారు. మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుల ఏడీఏను కోరారు. కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, ఏఈవో రాము, తేజ, రైతులు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డి మృతి

కొణిజర్ల, మార్చి22(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండల గోవపరం సొసైటీ మాజీ వైస్‌చైర్మన్ గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన చాగం కృష్ణారెడ్డి(63) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. కృష్ణారెడ్డి రైతు సంఘం నాయకుడిగా, సొసైటీ వైస్‌చైర్మన్‌గా, సీపీఎం పార్టీ నిర్మాణంలో సేవలందించాడు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బొంతు రాంబాబు, తాళ్ళపల్లికృష్ణ, భూక్యా వీరభద్రం, మండడపు శ్రీనివాసరావు, సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతి, సీపీఐ జిల్లా నాయకులు యర్రాబాబు పాల్గొని నివాళులర్పించారు.

మాజీ సర్పంచ్ సతీమణి సీతారామమ్మ ...

వైరా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పూర్వపు సోమవరం(వైరా) మాజీ సర్పంచ్, మాజీ జడ్పీటీసీ దివంగత కేతినేని సత్యనారాయణ సతీమణి కేతినేని సీతారావమ్మ శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఆమె భౌతికకాయానికి మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడైన పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు దొడ్డా పుల్లయ్య, బొళ్ల గంగారావు, పమ్మి అశోక్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, మద్దినేని రమేష్, పెద్దప్రోలు లక్ష్మయ్య, తేళ్లూరి వీరయ్య, కేతినేని అచ్చయ్య, తాళ్ల వసంతరావు, మేడిశెట్టి కృష్ణ నివాళులర్పించారు. సీతారావమ్మ కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. లయన్స్‌క్లబ్ ప్రోత్సాహంతో సీతారావమ్మ నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు.

ముస్లిం మైనారిటీ మండల కమిటీ ఎన్నిక

కొణిజర్ల,మార్చి22(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీ మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అమ్మపాలెం గ్రామానికి చెందిన గాలీబ్‌పాషాను, ఉపాధ్యక్షుడిగా షేక్ ఉస్సేన్, సెక్రటరీగా షేక్ జానిమియా, ట్రెజరర్‌గా అబ్దుల్లా, కోశాధికారిగా మోలాసాహెబ్‌లను ఎన్నుకున్నారు. తహసీల్దార్‌కు నూతన కమిటీ వివరాల వినతిని అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గాలీబ్‌పాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఇఫ్తార్ విందు విషయంలో నూతనంగా మండల కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ముస్లిం సోదరులందరూ సహకరించాలని కోరారు.



నూతన కమిటీ సభ్యుల పేర్లను తహసీల్దార్‌కు అందిస్తున్న దృశ్యం

ఎన్నికల హామీలను నేరవేర్చకపోతే పోరాటం చేస్తాం


» సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు



మాట్లాడుతున్న సీపీఎం డివిజన్ కార్యదర్శి గోపాలరావు

బోనకల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకపోతే పోరాట బాట పడతామని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు హెచ్చరించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలు కోసం క్షేత్రస్థాయిలో చేపట్టే పోరాటాలకు రూపకల్పన చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో 15,550 ఎకరాల్లో మక్క పంటను సాగు చేయగా వారబందీ విధానం వలన నీరందక చివర భూములు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మక్క కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని, బడ్జెట్ అంకెల గారడీగా ఉందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, కిలారు సురేష్, తుళ్లూరు రమేష్, కారంగుల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మద్రాస్ ఐఐటీ నుంచి వచ్చిన లేఖను ప్రదర్శిస్తున్న భూమేశ్వరరావు

వైరా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని న్యూలిటిల్‌ఫ్లవర్ కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు అన్నారు. శనివారం చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీ వారు ఆఫర్ చేస్తున్న వివిధరకాల కోర్సులను అందించేందుకు వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఐఐటీ మద్రాస్ అసోసియేట్ ప్రొఫెసర్ విఘ్నేష్ ముత్తువిజయన్ తెలిపారు. ఐఐటీ మద్రాస్ వారు ప్రవేశపెట్టిన వివిధ కోర్సులను తమ విద్యార్థులకు అందించటానికి తమ పాఠశాలను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీ వారు స్కూల్ కనెక్ట్ ప్రోగ్రామ్స్‌లో భాగంగా విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసేందుకు అడ్వాన్స్ ప్రోగ్రామ్స్ అయిన డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, ఆర్కిటెక్, డిజైన్ వంటి ప్రోగ్రామ్స్‌కు సంబంధించి 8వారాలు శిక్షణ ఇచ్చేందుకు అంగీకార పత్రం పంపించారని ఆయన వివరించారు. ఈ 8వారాల శిక్షణ తరగతుల్లో విద్యార్థుల్లో సాంకేతికపరమైన నైపుణ్యాలు పెరిగి ఇంజనీరింగ్ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డైరెక్టర్స్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, ప్రిన్సిపాల్స్ పి.భువనప్రసాద్, షాజీ మాథ్యూవ్, ఏవో ఎస్.నర్సింహారావు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత

కల్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత అని కల్లూరు ప్రభుత్వ వైద్యాధికారి నవ్యకాంత్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని పేరువంచ ఉన్నత పాఠశాలలో క్షయ వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత అనే అంశంపై వ్యాసరచన, పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు విద్యార్థులచే క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీబీ నోడల్ అధికారి రామారావు, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ సురేష్, పాఠశాల హెచ్‌ఎం సుదర్శనరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'ఫొటోల కోసమే కమల్‌రాజ్ ప్రయత్నం'

మధిరటౌన్, మార్చి22(ఆంధ్రజ్యోతి): ఫొటోల కోసమే బీఆర్ఎస్ నాయకుడు కమల్‌రాజు పోజులు ఇస్తున్నాడని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. శనివారం మధిరలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కట్టలేరులో వారం రోజుల నుంచి నీళ్లు పారుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఎప్పటికి అప్పుడు అధికారులకు సాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశాలు ఇస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు అయిలూరి సత్యనారాయణరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంపా వెంకటేశ్వరరెడ్డి, నాయకులు నిడమానూరు వంశీకృష్ణ, కర్నాటి రామారావు, దారా బాలరాజు, అద్దంకి రవి కుమార్, జహంగీర్, రమణ, రాజేందర్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కల్లూరు, మార్చి22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు తెలగాణ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలా, పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ప్రసంగిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి లింగబోయిన పుల్లారావు, పట్టణ బీసీ సంఘం అధ్యక్షుడు బయ్యావరపు నరేందర్, ఆళ్లాకుంట నరిసింహారావు, పెద్దబోయన శ్రీనువాసరావు, కృష్ణ, సత్యంబాబు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రపంచ జలదినోత్సవం

వైరా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వల్లాపురం గ్రామంలో శనివారం ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్రికల్చర్ బీఎస్సీ చదువులో భాగంగా క్షేత్రస్థాయిలో శిక్షణ కోసం వల్లాపురంలో ఉంటున్న అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఇక్కడ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నీటి పొదుపు, వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఏ.అక్షిత, హెచ్.చిన్నారి, ఎం.అఖిల, ఎం.భవాని, నేహాపిర్దోస్, ఆర్.సలోమి పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

మధిర రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు గ్రామంలోని కుంటబీడు కాలనీకి చెందిన ప్రజలు తాగునీరు రావడంలేదని ఖాళీ బిందెలతో కాలనీ ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ నిరసనకు సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు పల్లెపోగు జానకమ్మ, కుమ్మరపల్లి వెంకటకుమారి, ఏసుమణి, కమలమ్మ తదితరులు మాట్లాడుతూ కుంటబీడు కాలనీకి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటుచేసి తాగునీరందించాలని డిమాండ్ చేశారు. చేతిపంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నీటి కోసం అల్లాడుతున్నామని అధికారులు స్పందించి తాగునీరు అందేలా తక్షణ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు, మహిళలు చాట్ల బుజ్జీ, రత్నకుమారి, ఇనపనూరి మేరీ, పదిమల లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళలు